నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
I హైదరాబాద్, శుక్రవారం 2 ఆగస్టు 2024 HYDERABAD

# 5లోపు బకాయిలు చెల్లించాల్సిందే




## బల్దియా ఎదుట కాంట్రాక్టర్ల నిరసన

సిటీబ్యూరో, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ): పెండింగ్ బకాయిలు చెల్లించాలంటూ గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ముందు బల్దియా కాంట్రాక్టర్లు ఆందోళన చేపట్టారు. వివిధ అభివృద్ధి పనులకు రావాల్సిన రూ.1500 కోట్ల మేర బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దాదాపు రెండున్నర గంటల పాటు నిరసన తెలిపారు. ఈ నెల 5వ తేదీలోగా బకాయిలను చెల్లించకుంటే జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్స్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.






మియాపూర్ క్రాస్‌రోడ్డులో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

## సీఎం, డిప్యూటీ సీఎం అనుచిత వ్యాఖ్యలపై

# బీఆర్ఎస్ కన్నెర్ర

## క్షమాపణ చెప్పాలని డిమాండ్

ధర్నాలు, రాస్తారోకోలతో దద్దరిల్లిన నగరం • దిష్టిబొమ్మల దహనం • రోడ్లపై బైఠాయింపు



కుత్బుల్లాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ మహిళా శ్రేణులు



నిజాం కాలేజీ నుంచి అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన బీఆర్ఎస్వీ నేతలు


**మహిళాలోకం కన్నెర్ర చేసింది..** నిరసనలు, ధర్నాలతో హోరెత్తించింది. అసెంబ్లీ సాక్షిగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డిపై అసందర్భ, అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క క్షమాపణ చెప్పాలంటూ.. గురువారం నగరవ్యాప్తంగా ఆడపడుచులు, బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలు చేపట్టారు. నిండు సభలో ఆడబిడ్డలను అవమానించడాన్ని తీవ్రంగా ఖండించారు. 'ఓటుకు నోటు దొంగ రేవంత్‌రెడ్డి'.. మహిళా ఎమ్మెల్యేలకు క్షమాపణ చెప్పాలంటూ నిజాం కళాశాలలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ విద్యార్థులు నిరసన తెలిపారు. పలు చోట్ల సీఎం దిష్టిబొమ్మలను దహనం చేశారు. బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థి సంఘాలు సైతం రోడ్లపై బైఠాయించారు. ప్రతి ఆడబిడ్డకు ఆ వ్యాఖ్యలు అవమానకరమంటూ.. ధ్వజమెత్తారు. తెలంగాణ సంప్రదాయం అంటేనే మహిళలను గౌరవించడమన్నారు. కాంగ్రెస్ ఆడపడుచులను చిన్నచూపు చూడటం మానుకోకపోతే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కాగా, ధర్నా, రాస్తారోకోలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులను పోలీసులు లాక్కెళ్లి.. బలవంతంగా వ్యాన్లలో ఎక్కించి.. పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అయితే అరెస్టులతో తమను ఆపలేరంటూ.. నాయకులు హెచ్చరించారు.

*- సిటీబ్యూరో, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ)*

## గృహిణిని బెదిరించి..

# ₹ 40 లక్షలు కాజేశారు

సిటీబ్యూరో, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ): 'మీరు డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు.. మేం చెప్పినట్లు చేయకపోతే.. మహారాష్ట్ర మాజీ సీఎంకు సంబంధించిన ముఠాతో సంబంధాలున్నాయంటూ కేసులు నమోదు చేస్తాం'.. అంటూ ఓ గృహిణిని బెదిరించి.. రూ. 40 లక్షలు కాజేశారు సైబర్ నేరగాళ్లు. సదరు మహిళకు తాము ఫెడెక్స్ నుంచి కాల్ చేస్తున్నామంటూ మాట్లాడిన నేరస్తులు.. 'మీ పేరుతో ఉన్న పార్సిల్‌లో ఎండీఎంఏ డ్రగ్స్ ఉంది.. ముంబై పోలీసులకు కాల్ బదిలీ చేస్తున్నాం' అని చెప్పారు. ఆ తర్వాత తాము ముంబై పోలీసులమని చెబుతూ.. ఓ ఫొటోను పంపించారు. అది మహారాష్ట్ర మాజీ సీఎం ఫొటో అని చెబుతూ.. 'అతనికి ప్రపంచవ్యాప్తంగా నెట్‌వర్క్ ఉంది. మీకు ఆ గ్యాంగ్‌లతో సంబంధముంది. అలాగే హత్య కేసుల్లోనూ సంబంధాలున్నాయి.. మీది, మీ కుటుంబ సభ్యులు, బంధువుల బ్యాంకు ఖాతాలు సీజ్ చేసి.. మిమ్మల్ని అరెస్ట్ చేస్తాం' అంటూ బెదిరించారు. కంగారుపడిన బాధితురాలు.. రూ. 40 లక్షలు రెండు దఫాలుగా సైబర్ నేరగాళ్లు సూచించిన బ్యాంకు అకౌంట్‌లో డిపాజిట్ చేసింది. కాల్ కట్‌కాగానే ఇదంతా మోసమని గుర్తించి.. సైబర్ క్రైమ్ కాల్‌సెంటర్‌కు ఫోన్ చేసి, సీసీఎస్ సైబర్‌క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



## నిబంధనలకు విరుద్ధంగా..

# పార్కింగ్ ఫీజు వసూలు.. నోటీసులు

సిటీబ్యూరో: నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న మాల్స్, మల్టీప్లెక్స్‌లపై చర్యలకు ఉపక్రమించినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. పలు మాల్స్, మల్టీప్లెక్స్, సినిమా థియేటర్లలో నిబంధనలకు విరుద్ధంగా ప్రజల నుంచి పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, తనిఖీలు చేసేందుకు సర్కిళ్ల వారీగా ప్రత్యేక బృందాలను నియమించినట్లు చెప్పారు. సింగిల్ స్క్రీన్ థియేటర్ కింద రిజిస్టర్ చేసుకొని, మల్టిపుల్ స్క్రీన్ నడిపిస్తున్నట్లు బయటపడిందన్నారు. అలాగే కొన్ని చోట్ల ఫుడ్ స్టాళ్లలో అమ్ముతున్న తినుబండారాలు నాణ్యత లేనివిగా గుర్తించినట్లు తెలిపారు. కాగా, తనిఖీల్లో అక్రమాలను గుర్తించిన ఆయా మాల్స్‌కు, మల్టీప్లెక్స్‌లకు కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులకు నోటీసులు జారీ చేశారు.

# విలీన ప్రక్రియకు అడుగులు ?

సిటీబ్యూరో, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ): ఔటర్ రింగు రోడ్డు వరకు జీహెచ్ఎంసీని విస్తరించే ప్రక్రియకు అడుగులు పడినట్లు తెలిసింది. ఇప్పటికే ఓఆర్ఆర్ వరకు ప్రత్యేకంగా 'హైడ్రా' వ్యవస్థను ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. తాజాగా ఔటర్ లోపల ఉన్న 8 మున్సిపల్ కార్పొరేషన్లు, 20 మున్సిపాలిటీలు, 33 గ్రామ పంచాయతీలను బల్దియాలోకి విలీనం చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో విలీన ప్రక్రియ వేగవంతానికి సబ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఈ సబ్ కమిటీ తొలి సమావేశం 3న జరగనున్నట్లు సమాచారం. కాగా, రామచంద్రాపురం, ఐలాపూర్, కర్దనూర్,కృష్ణారెడ్డి పేట, ముత్తంగి, పోచారం, సుల్తాన్‌పూర్, కాచివాణి సింగారం, కొర్రెముల, పిర్జాదీగూడ, ప్రతాప సింగారం, బాచారం, గౌరెల్లి, కుత్బుల్లాపూర్, తారమతిపేట, చేర్యాల, గోదాం కుంట, కీసర, రాంపల్లి, తిమ్మాయిపల్లి, మంకాల్, గౌడవెల్లి, పుద్దూర్, మంచిరేవుల, బొమ్మరాసిపేట, గోడకండ్ల కలాన్, గోల్కొండ కుర్దు, హమిదుల్లా నగర్, జన్వాడ, పాటి తదితర గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనం కాగా, త్వరలోనే 20 మున్సిపాలిటీలు, 8 కార్పొరేషన్లకు సైతం జీహెచ్ఎంసీ పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించి ఈ మేరకు చర్యలను వేగిరం చేసినట్లు తెలిసింది.

# రాత్రి 10 గంటలకే బంద్

- చిన్న దుకాణాలను మూసివేయిస్తున్న పోలీసులు
- బడా హోటళ్లు మాత్రం అర్ధరాత్రి వరకు..
- చార్మినార్ వద్ద తగ్గిన సందర్శకుల సంఖ్య

సిటీబ్యూరో, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ): విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహానగరంలో 10 గంటలైతే దుకాణాలు మూత పడుతున్నాయి. ఈ కారణంగా చార్మినార్‌ను చూసేందుకు రాత్రి వేళలో వచ్చే సందర్శకుల సంఖ్య గణనీయంగా తగ్గింది. మరోవైపు 10 గంటల తర్వాత బయట తిరిగే వారిపై హైదరాబాద్ పోలీసులు లాఠీలు ఝళిపిస్తున్నారు. ఇలా పాతనగరంలో పోలీసులు ఇంటి వద్ద నిల్చున్నా..చితకబాదిన వీడియోలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. ఇదే అంశాన్ని ప్రతిపక్ష పార్టీలు అసెంబ్లీలో లేవనెత్తాయి. హైదరాబాద్ పోలీసులు.. ఫెయిల్యూర్ పోలీస్ అంటూ ఆరోపణలు చేశారు. నేరగాళ్లపై నిఘా ఉంచి పట్టుకోవాల్సిన టాస్క్‌ఫోర్స్ రాత్రి అమాయకులను కొడుతూ.. పగలు నిద్రపోతుందంటూ ధ్వజమెత్తారు. తాజాగా రాత్రి వేళల్లో పోలీసులు లాఠీలకు పనిచెప్పడం తగ్గించారు. అయితే దుకాణాలు మాత్రం రాత్రి 10 గంటలకే మూత పడుతున్నాయి. చార్మినార్‌ను చూసేందుకు రాత్రి వేళల్లో కూడా చాలా మంది వస్తుంటారు. చుట్టుపక్కల ఉండే హోటళ్లు రాత్రి 12 గంటల వరకు తెరిచే ఉండేవి. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. ఈ విషయంపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. యువత బయట తిరగకుండా పోలీసులు తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని కొందరంటుంటే.. మరికొందరు మాత్రం పర్యాటక ప్రాంతంగా ఉండే చార్మినార్ వంటి ప్రాంతంలో 10 గంటలకే దుకాణాలు మూసివేయడంతో ఇక్కడకు వచ్చే వారి సంఖ్య చాలా వరకు తగ్గుముఖం పట్టిందంటూ స్థానికులు పేర్కొంటున్నారు.

## బడా బాబుల హోటళ్లు.. బార్లు మాత్రం..

సాధారణ హోటళ్లను రాత్రి 10 గంటలకే మూసేయిస్తున్న పోలీసులు.. బార్లు, బడాబాబుల హోటళ్లను మాత్రం 12 గంటల వరకు కొనసాగినా..ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. మద్యం, బార్లు రాత్రి 12 గంటల వరకు చాలా చోట్ల తెరిచి ఉంటున్నాయనే విమర్శలున్నాయి. అలాగే బంజారాహిల్స్‌లోని కమిషనరేట్ కార్యాలయం ఎదురుగా ఉన్న నిలోఫర్ హోటల్ 12 గంటల వరకు తెరిచి ఉంటుందని.. స్వయంగా అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యే వెల్లడించిన విషయం తెలిసిందే. ఇలా అనేక ప్రాంతాల్లో హోటళ్లు, బార్లు తెరిచి ఉన్నా..పోలీసులు చూసీచూడనట్లు ఉంటున్నారని, అలాంటి వారి వద్ద నెల వారీగా మామూళ్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.



గాయపడిన చిన్నారి ప్రవళిక

# దొరికిన వారిని దొరికినట్లు..

## బాలానగర్‌లో పిచ్చికుక్క స్వైర విహారం..16 మందికి గాయాలు

బాలానగర్, ఆగస్టు 1: బాలానగర్‌లో పిచ్చి కుక్క స్వైరవిహారం చేసింది. ప్రజలను ఉరికిస్తూ... దొరికిన వారిని దొరికినట్లు కరుస్తూ.. బీభత్సాన్ని సృష్టించింది. ఏకంగా 16 మందిని కరిచింది. బాధితుల్లో రెండేండ్ల చిన్నారుల నుంచి పెద్దల వరకు ఉన్నారు. గురువారం సాయంత్రం రాజు కాలనీలో బయట ఆడుకుంటున్న చిన్నారులను పిచ్చి కుక్క కరవడం మొదలుపెట్టింది. రవళి, చైతన్య, మధు, గణేశ్, సృజన్, ప్రవళిక, వాసీం, అమన్‌దీప్‌సింగ్, ప్రభాకర్, రజాక్.. ఇలా వీరందరిపై దాడి చేసింది. దీంతో స్థానికులు కర్రలు తీసుకొని వెంటపడటంతో వినాయకనగర్ కాలనీలోకి వెళ్లింది. అక్కడ కూడా పలువురిని వెంటబడి కరవడంతో అక్కడి ప్రజలు సైతం కర్రలతో తరిమారు. అనంతరం కుక్క నవజీవన్‌నగర్ కాలనీలోకి చొరబడి అక్కడ కూడా మరికొందరిని కరిచింది. ఇలా మూడు చోట్ల ఏకంగా పదహారు మందిని కరవడంతో స్థానికులు పరుగులు తీశారు. మూడు కాలనీల్లో కేవలం గంట వ్యవధిలోనే పదుల సంఖ్యలో కుక్క బారిన పడటంతో స్థానికులు జీహెచ్ఎంసీకి సమాచారం అందించారు. సిబ్బంది ఎట్టకేలకు నవజీవన్‌నగర్ కాలనీలో ఆ పిచ్చి కుక్కను పట్టుకొని వాహనంలో అక్కడి నుంచి తరలించారు.

### బాధితులకు పీహెచ్‌సీలో చికిత్స

మూడు కాలనీల్లో పిచ్చి కుక్క బారిన పడిన వారికి బాలానగర్ ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. గురువారం ఒక్కరోజే 22 మంది కుక్క కాటు బాధితులు పీహెచ్‌సీకి వచ్చి వ్యాక్సిన్ తీసుకున్నారని సిబ్బంది పేర్కొనడం గమనార్హం.

### పిచ్చికుక్కలు తిరుగుతున్నా..

రాజుకాలనీలో పిచ్చికుక్కలు తిరుగుతున్నా.. జీహెచ్ఎంసీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఫిర్యాదులు చేసినప్పుడు వస్తున్నారు. కుక్కలను తీసుకుపోయి ఇంజక్షన్లు చేసి తిరిగి ఇక్కడికే తీసుకొచ్చి వదిలి వేస్తున్నారు.

**-బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి**



## సామాన్యురాలిగా..

బల్దియా కమిషనర్ ఆమ్రపాలి గురువారం మోండా మార్కెట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సామాన్యురాలిగా మార్కెట్ అంతా కలియ తిరిగారు. మార్కెట్‌లో ఉన్న సదుపాయాలు, చిరువ్యాపారులు పడుతున్న ఇబ్బందులు, స్థానిక వినియోగదారుల అభిప్రాయాలను స్వయంగా తెలుసుకున్నారు.